బుధవారం
14-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 84
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ప్రత్యేక పేజీ నేటి నుంచి ఇస్తున్నాం... ॥సం॥

ఇలాంటి తీర్పులు ప్రమాదకరం

- ప్రార్థనా స్థలాల పరిరక్షణే ఆ చట్టం ఉద్దేశం
- దేశ ప్రాథమిక స్వభావాన్ని పునర్నిర్వచించే యత్నాలొద్దు
- జ్ఞానవాపి కేసులో జిల్లా కోర్టు తీర్పుపై సీపీఐ, సీపీఎం

న్యూఢిల్లీ: జ్ఞానవాపి మసీదుపై ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి జిల్లా కోర్టు తీర్పుపై సీపీఐ, సీపీఎం ఘాటుగా స్పందించాయి. కోర్టు తీర్పును ఆక్షేపించాయి. జ్ఞానవాపి వివాదంపై కాంగ్రెస్ మౌనం వహించింది. కోర్టు తీర్పు 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘించినట్లు ఉందని సీపీఐ, సీపీఎం విమర్శించాయి. ఇలాంటి తీర్పులు భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ జ్ఞానవాపి కేసులో తాజా పరిణామాలు ఇటువంటి ఇతర కట్టడాల దిశగా 'హిందూత్వ' మార్గాన్ని సుగమం చేసేలా ఉన్నదని వ్యాఖ్యానించారు. ఆ మేరకు బీజేపీ, దాని అనుబంధ సంస్థల నేతలు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్నే ప్రజా ప్రతినిధులు సవాల్ చేయడమన్నది చాలా ప్రమాదకర ధోరణి అని డి.రాజా అన్నారు. దేశ లౌకిక స్వభావాన్ని పునర్నిర్వచించే ప్రయత్నం తగదని హితవు పలికారు. ప్రార్థనా స్థలాల చట్టం-1991 అణచివేత ద్వారా దేశాన్ని అగాధంలోకి నెట్టివేస్తున్నారని రాజా మండిపడ్డారు. దీనిని ఖండిస్తున్నామని చెప్పారు. మరో ప్రార్థనా స్థలానికి ఇటువంటి పరిస్థితి దాపురించకూడదంటే పోరాటం తప్పదని డి.రాజా హెచ్చరించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవడం లేదని, ఇక్కడ మౌనం పనికి రాదన్న విషయాన్ని గ్రహించాలని కాంగ్రెస్ పార్టీకి ఆయన సూచించారు. మరోవైపు సీపీఎం పొలిట్ బ్యూరో కూడా ఒక ప్రకటనలో వారణాసి జిల్లా కోర్టు తీర్పును ఖండించింది. ప్రార్థనా స్థలాల చట్టాన్ని న్యాయనిపుణులు తప్పుగా అర్థం చేసుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి రావచ్చని పేర్కొంది. మైనారిటీ వర్గాలే లక్ష్యంగా చరిత్రను వక్రీకరించే పాలకపక్షం తీరు బహిరంగ సత్యమని వ్యాఖ్యానించింది. గతంలో ఆలయాలు ఉన్న స్థలాల్లో ఇప్పుడు మసీదుల నిర్మాణం జరిగినదన్న వాదన మతభావాలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించే అజెండాతో చేస్తున్నవని సీపీఎం విమర్శించింది. దురుద్దేశంతో దాఖలయ్యే పిటిషన్లకు అడ్డుకట్ట వేయాల్సిందేనని సీపీఎం పిలుపునిచ్చింది.

మహా పాదయాత్రలో రైతులు, మహిళలు
రెండవ రోజూ అదే జోరు

అమరావతే
మా రాజధాని

- అడుగడుగునా ఘన స్వాగతాలు
- రథం నడిపి ఉత్సాహం నింపిన సీపీఐ నేత రామకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు/తాడేపల్లి : రాజధాని ఉద్యమానికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఏకైక రాజధాని ఆవశ్యకతను రాష్ట్ర ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో ప్రారంభమైన అమరావతి రైతుల మహా పాదయాత్ర 2.0 రెండవ రోజు మంగళవారం అదే ఉత్సాహంతో కొనసాగింది. మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ఉన్న నన్నపనేని రాజకుమారి కళ్యాణ మండపం వద్ద ప్రారంభమైన రెండవ రోజు మహా పాదయాత్ర మిద్దె సెంటర్, మెయిన్ బజార్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మంగళగిరి బ్రిడ్జి, ఆత్మకూరు, పెద్ద వడ్లపూడి, రేవేంద్రపాడు మీదుగా సాగి దుగ్గిరాలలో ముగిసింది. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ వెంకటేశ్వరస్వామి రథాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నడిపి పాదయాత్రలో ఉత్సాహం నింపారు. అమరావతి నుంచి అరసవిల్లికి 60 రోజుల పాటు నిర్వహించనున్న ఈ పాదయాత్రకు ఆయా ప్రాంతాలలో విశేష ఆదరణ లభించింది. మంగళగిరి పట్టణ ప్రాంతం, పాదయాత్ర సాగిన గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని

- మిగతా 2 లో

తదుపరి ఏజీగా ముకుల్ రోహ్తగి!

సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగి మరోసారి అటార్నీ జనరల్(ఏజీ)గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

6 లో

అన్ని వైద్య కళాశాలల్లో క్యాన్సర్ విభాగాలు

- నివారణ, నియంత్రణ, చికిత్సపై ప్రత్యేక దృష్టి
- 'ఫ్యామిలీ డాక్టర్' పర్యవేక్షణకు జిల్లాకొక ప్రత్యేక అధికారి

3లో

అత్యవసర ఔషధాల నుంచి క్యాన్సర్ కారక ఔషధాల తొలగింపు

384 మందులతో కొత్త జాబితా

6లో

కొలిక్కి వచ్చేనా?

- 27న విభజన సమస్యలపై సమావేశం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు కేంద్ర హోం శాఖ లేఖ
- రెండు రాష్ట్రాల సీఎస్‌లతోపాటు 9 శాఖలకు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి పరిష్కారం కాని విభజన సమస్యలపై కేంద్ర హోం శాఖ ఈనెల 27వ తేదీన సమావేశం నిర్వహించనుంది. రాష్ట్ర విభజన జరిగి 8 సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ రెండు రాష్ట్రాలకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీనిపై ఏపీ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నా మొక్కుబడి సమావేశాలు నిర్వహించడం తప్ప స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేదు. వాటి అమలుకు చిత్తశుద్ధి కనబర్చిన దాఖలాల్లేవు. దీంతో ఈనెల 27న జరగనున్న సమావేశంలో అయినా సమస్యలేమైనా కొలిక్కి వస్తాయేమోనని అధికారులు ఆశిస్తున్నారు. విభజన చట్టం ప్రకారం రాజధానికి కేంద్ర సహకారంపై ఈ భేటీలో చర్చించబోతున్నామంటూ కేంద్ర హోంశాఖ ఏపీ, తెలంగాణకు పంపించిన అజెండాలో పేర్కొంది. రాజధాని నగరం నుంచి ర్యాపిడ్ రైల్ అనుసంధానం అంశాన్ని కూడా హోంశాఖ పొందుపరిచింది. రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం, విభజన కావాల్సిన అంశాల్లో... షెడ్యూల్ 9లో ఉన్న ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు, షెడ్యూల్ 10లో ఉన్న రాష్ట్ర సంస్థల విభజన, విభజన చట్టంలో పేర్కొనని సంస్థల పంపిణీ, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్, సింగరేణి కాలరీస్, ఏపీ హెవీ మెషినరీ ఇంజినీరింగ్, నగదు, బ్యాంకు బ్యాలెన్సులు. విదేశీ సాయంతో చేపట్టిన ప్రాజెక్టులపై తీసుకున్న అప్పుల విభజన. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఏపీ, తెలంగాణ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర ఆర్థికశాఖలోని రెవెన్యూ, వ్యయాలు, ఆర్థిక సర్వీసులు, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శులు, ఆహార, విద్య, వ్యవసాయ కార్యదర్శులు, పెట్రోలియం, సహజ వాయువుల కార్యదర్శి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, రైల్వే బోర్డు చైర్మన్‌లు సమావేశానికి హాజరు కావాలని కేంద్ర హోంశాఖ డైరెక్టర్ పార్థసారథి సర్క్యులర్ విడుదల చేశారు. మొత్తం 9 శాఖలకు చెందిన అధికారులను భేటీకి ఆహ్వానించారు. కొత్త రాజధానికి నిధుల అంశం గురించి కూడా కేంద్ర హోంశాఖ అజెండాలో పేర్కొంది. రెవెన్యూ లోటు భర్తీ, వెనుకబడిన ప్రాంతాల్లోని ఏడు జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు, వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం, ఇప్పటివరకు ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేసిన నిధుల అంశాలు చర్చకు రానున్నాయి.

విద్యుత్ బకాయిలపై తెలంగాణ తిరకాసు

ఏపీ విద్యుత్ సంస్థలకు తెలంగాణ విద్యుత్ సంస్థలు బాకీ విషయమై ఏపీ ప్రభుత్వం ఎప్పటి నుంచో అడుగుతోంది. దీనిపై కేంద్రానికి చాలాసార్లు

- మిగతా 2 లో

'వెబ్' నిరీక్షణ!

- తెరుచుకోని ఆప్షన్లు
- తొలిరోజే అభ్యర్థులకు పాట్లు
- అధికారుల నిర్లక్ష్యం
- ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2022 కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్లకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. ముందు ప్రకటించిన ప్రణాళిక ప్రకారం మంగళవారం ఉదయం నుంచి వెబ్‌ఆప్షన్లకు షెడ్యూలు ఖరారు చేశారు. దీంతో అర్హత పొందిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులంతా వెబ్‌ఆప్షన్ల కోసం సిద్ధమవ్వగా, సాయంత్రం ప్రకటిస్తామని అధికారికంగా వెబ్‌సైట్లో సమాచారం ఇచ్చారు. అధికారుల తీరుపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు వెబ్ ఆప్షన్లు కోసం అభ్యర్థులు నిరీక్షించినా, అప్పటివరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వలేదు. దాదాపు 1.24లక్షల ఇంజినీరింగ్ సీట్లు ఉంటే లక్ష మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. సాంకేతిక విద్యాశాఖ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను గందరగోళం చేసింది. షెడ్యూలు ప్రకారం గతనెల 28 నుంచే విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవాల్సి ఉంది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం దానిని వాయిదా వేసింది. ఫలితాలు విడుదలైనా కౌన్సెలింగ్‌ను వేగవంతం చేయలేదు. పొడిగించిన నమోదు గడువు కూడా 5వ తేదీతోనే ముగిసినా, సవరణ షెడ్యూలు విడుదలలో నిర్లక్ష్యం చేసింది. దీంతో చాలా మంది విద్యార్థులు తెలంగాణ సహా పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు.

17 వరకు ఆప్షన్లకు గడువు

ఇప్పటికే ఏపీఈఏపీసెట్‌కు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసి వారం రోజులవుతోంది. ఈనెల 17 వరకు ఆప్షన్లు ఎంపికకు గడువు విధించారు. 18న ఆప్షన్లలో మార్పులకు అవకాశం కల్పించారు. 22న సీట్ల కేటాయింపు జాబితాను విడుదల చేస్తారు. 23 నుంచి 27లోపు కాలేజీల్లో విద్యార్థులు నివేదిక ఇవ్వాల్సి ఉంది. 26 నుంచే తరగతులు ప్రారంభమవుతాయి. ఈ కౌన్సెలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 25 హెల్ప్‌లైన్ సెంటర్లను ప్రభుత్వం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అసైన్డ్ భూముల కుంభకోణం కేసు
ఐదుగురి అరెస్టు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని అసైన్డ్ భూముల కుంభకోణం అభియోగాలపై నమోదైన కేసులో ఐదుగుర్ని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణ... ఆయన బంధువులు, పరిచయస్తుల పేరుతో బినామీ లావాదేవీలు జరిపినట్లుగా అభియోగాలున్నాయి. మొత్తంగా 1100 ఎకరాల అసైన్డ్ భూముల వ్యవహారంలో 169.27 ఎకరాలకు సంబంధించి అక్రమాలు జరిగాయన్న అభియోగంపై సీఐడీ దర్యాప్తు చేప ట్టింది. ఈ మేరకు కొల్లి శివరామ్, గట్టెం వెంక టేష్, చిక్కాల విజయసారథి, బడే ఆంజనేయులు, కొట్టి దొరబాబును సీఐడీ అధికారులు అందుపులోకి తీసుకున్నారు. అనంతవరం, కృష్ణాయపాలెం, కూరగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో వేర్వేరు నంబర్లలో దాదాపు 89.8 ఎకరాల భూమిని మాజీ మంత్రి నారాయణ తన బంధువులు, పరిచయస్తుల పేరుతో అక్రమంగా కొనుగోలు చేశారన్న ఆరోపణలున్నాయి. రామకృష్ణా హౌసింగ్ డైరెక్టర్ ఖాతాల ద్వారా పేమెంట్లు చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఈ కేసులో ఇతర నిందితులు, వారి తరపు మనుషులు 79.45 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేశారని వెల్లడైంది. నారాయణ, రామకృష్ణా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య రూ.15కోట్ల లావాదేవీలు జరిగినట్లుగా సీఐడీ నిర్ధారించింది.

దశాబ్దాలుగా గోదారమ్మ కన్నీరు లంక గ్రామాలకు చేటు తెస్తూనే ఉంది. ఉగ్రరూపం దాల్చి పాడిపంటలను నేలపాలు చేస్తూ అష్టకష్టాలకోర్చి నిర్మించుకున్న గూళ్లను కూల్చివేస్తోంది. ప్రజలను కట్టుబట్టలతో మిగిల్చి పునరావాసాలకు పరిమితం చేస్తోంది. జులైలో రాత్రికిరాత్రే ఊళ్లను ముంచెత్తి లంకగ్రామాలను కకావికలం చేసిన వరద సరిగ్గా వందేళ్ల క్రితం వచ్చినట్టు ప్రభుత్వ సమాచారం చెబుతోంది. రాష్ట్రాలు దాటి ప్రవహించే గోదారమ్మకు ఎక్కడ కోపమొచ్చినా లంక గ్రామాలు కకావికలం కావాల్సిందే. ఏటా వరదలు చూస్తూనే ఉన్నాం... పాడిపంట నష్టపోతూనే ఉన్నాం...ఉపాధి కరువై పశువులతో సహా పస్తులుంటున్నాం... ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కనుగొనాలంటున్న లంక గ్రామాల ప్రజల దుస్థితిపై విశాలాంధ్ర ప్రత్యేక కథనం...

గోదారమ్మ కన్నీరు...
లంకకు చేటు!

- వరద ఉధృతికి ఊరూవాడ విలవిల
- గూడూనీడ నీటిపాలు
- పాడీపంట నేలపాలు
- కట్టుబట్టలతో పునరావాసాలకు
- దశాబ్దాలుగా తప్పని తిప్పలు
- జులై భీతావహానికి వందేళ్ల చరిత్ర!

2 లో

రాజధాని అమరావతి కోసం పాదయాత్రలో పాల్గొన్న ముప్పాళ్ల, జంగాల, మల్యాద్రి తదితరులు

మహా పాదయాత్రలో మహిళలు

మీ 'యాత్ర'లో పిల్లల్ని వాడుకుంటారా...?

రాహుల్, కాంగ్రెస్ పై చర్యలకు ఈసీని కోరిన ఎన్‌సీపీసీఆర్

న్యూదిల్లీ: 'భారత్ జోడో యాత్ర'లో పిల్లలను రాజకీయ సాధనాలుగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై కాంగ్రెస్, రాహుల్ గాంధీపై వచ్చిన ఫిర్యాదు పై అవసరమైన చర్యలు, విచారణ ప్రారంభించాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఎన్నికల సంఘాన్ని కోరింది. గాంధీ, జవహర్ బాల్ మంచ్ రాజకీయ ఉద్దేశాలతో పిల్లలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారని ఫిర్యాదు అందిందని తెలిపింది. ఫిర్యాదుదారు ప్రకారం, 'భారత్ జోడో... బచ్చా జోడో' నినాదం కింద ఒక రాజకీయ అజెండాతో పిల్లలను లక్ష్యంగా చేసుకుని వారి ప్రచారంలో పాల్గొనేలా చేసిన అనేక అవాంతర చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్నాయని ఆరోపించింది'. పెద్దలు మాత్రమే రాజకీయ పార్టీలో భాగం కావాలన్న ఎన్నికల కమిషన్ నిబంధనలను ఇది ఉల్లంఘించడమేనని ఎన్‌సీపీసీఆర్ ఆరోపించింది. 'ప్రాథమికంగా బాలల హక్కుల ఉల్లంఘన జరిగినందున. ఇంకా, రాజకీయ అజెండాను నెరవేర్చడానికి పిల్లలను ఆసరాగా ఉపయోగించడం వారి మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపే బాల దుర్వినియోగం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి వ్యతిరేకం' అని పేర్కొంది. ఈ విషయాన్ని పరిశీలించి, సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదులో పేర్కొన్న రాజకీయ పార్టీ, దాని సభ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ మీ కార్యాలయాలను అభ్యర్థిస్తోంది' అని ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో కోరింది.

గుజరాత్ కలల పోరాటం

- క్రేజీవాల్ వర్సెస్ అమిత్ షా
- పోటాపోటీ ఎన్నికల ప్రచారం
- వారిది కలల వ్యాపారం...
- అవును తప్పడు వాగ్దానం చేసే వారిని నమ్మవద్దు



అహ్మదాబాద్: గుజరాత్ ఎన్నికల ప్రచారం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మధ్యే సాగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలు, సమావేశాలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం గుజరాత్ ఎన్నికల ప్రచారంలో కలల పోరాటం జరిగింది. వారి మధ్య మాటలు... అధికారం కోసం కలలు, వాగ్దానాల చుట్టే తిరిగాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ 'కలల వ్యాపారం చేసే వారు గుజరాత్‌లో విజయం సాధించలేరు' అని అన్నారు. దీనికి ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ సమాధానం ఇస్తూ, 'అవును, అతను కచ్చితంగా చెప్పింది నిజమే. అస్సలు నమ్మవద్దు. నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడం ద్వారా మీకు ఒక్కొక్కరికి 15 లక్షలు ఇస్తామని చెప్పిన వారు' అని ఎద్దేవా చేశారు. కాగా తన లోక్‌సభ నియోజకవర్గం గాంధీనగర్‌లో కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించేందుకు అమిత్ షా దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ తన సొంత రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకోవడమే కాకుండా 'అత్యధిక మెజారిటీ' సాధిస్తుందని ఆయన అన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అహ్మదాబాద్‌లో దీనిపై ప్రశ్నించినప్పుడు, 'తప్పుడు కలలు అమ్మేవారిని ప్రజలు విశ్వసించకూడదని నేను అంగీకరిస్తున్నాను. బదులుగా, ఇప్పటికే దిల్లీ, పంజాబ్‌లలో విద్యుత్తును ఉచితంగా అందిస్తున్నాం. దానిని గుజరాత్‌లో కూడా ఉచితంగా చేస్తానని నేను అంగీకరిస్తున్నాను' అని అన్నారు. బీజేపీ వ్యతిరేకిస్తున్న 'ఉచితాలు' లేదా సబ్సిడీపై ఒక పెద్ద చర్చల్లో ఇది తాజాది. అయితే ఆప్, అలాగే అనేక ఇతర పార్టీలు సంక్షేమ పథకాలను 'ప్రజలకు అనుకూలమైన' పాలనకు అవసరమైనవిగా చూస్తాయి. గుజరాత్ బీజేపీ పక్షాన ఉందని అమిత్ షా పేర్కొంటూ, 'గుజరాత్ ప్రజల గురించి నాకు బాగా తెలుసు. వారు మా పనిని గుర్తిస్తారు. వాస్తవానికి పని చేసే వారు బీజేపీతో ఉన్నారు. అనేక ఏళ్ల నుంచి గుజరాత్‌ను ఆ పార్టీ నిరంతరం పాలిచింది. 12 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రయోగ వేదిక. మా గెలుపు ఖాయం' అని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా బీజేపీ కలలు కంటోందని కేజ్రీవాల్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. 'అమిత్ షా తన సొంత పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం నాకు ఆశ్చర్యంగా ఉంది. అతను 'కలలు అమ్మేవారిని నమ్మవద్దు' అని చెబుతున్నాడు'. అందువల్ల మీ బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని, ఎవరు వచ్చి చెప్పినా వారిని అస్సలు నమ్మవద్దు' అని నరేంద్ర మోదీ 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రస్తావిస్తూ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో విజయవంతమైన 2022ని ప్రారంభించిన తర్వాత గుజరాత్ దాని తదుపరి పెద్ద ప్రాజెక్టు. 2017లో కూడా గుజరాత్‌లో పాగా వేయాలని ప్రయత్నించినా ఘోరంగా విఫలమైంది. అప్పటి పంజాబ్‌లో అంచనాల కంటే తక్కువ ప్రదర్శన కనబరిచింది. ఈసారి పంజాబ్ జోరును గుజరాత్‌లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. అహ్మదాబాద్‌లోని ఆటో రిక్షా డ్రైవర్ ఇంటిలో విందు వంటి ప్రజలను ఆకట్టుకునే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కేజ్రీవాల్ ఆప్ ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారు. ఆ విందు సందర్భంగా భద్రతా కారణాలను ఉటంకిస్తూ, ఆటోలో ప్రయాణించవద్దని పోలీసులు చెప్పినప్పటికీ ఆయన ముందుకు సాగాడు. 'ఆప్ విజయం పై బీజేపీకి ఉన్న భయమే పోలీసుల చర్యకు కారణం' అని దిల్లీ సీఎం, ఆప్ అధినేత అన్నారు.

అత్యవసర ఔషధాల నుంచి

క్యాన్సర్ కారక ఔషధాల తొలగింపు



384 మందులతో కొత్త జాబితా

న్యూదిల్లీ: జాతీయ అత్యవసర ఔషధాల జాబితాను కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. కొత్త జాబితాలో మొత్తం 384 ఔషధాలున్నాయి. ఇందులో ఐవర్‌మెక్టిన్ లాంటి యాంటీ ఇన్ఫెక్టివ్‌లతో పాటు 34 మందులను కొత్తగా చేర్చారు. ఇక రనిటైడిన్ సహా 26 ఔషధాలను అత్యవసర మందుల జాబితా నుంచి తొలగించారు. ప్రముఖ యాంటాసిడ్ అయిన రనిటైడిన్‌ను తొలగించడంతో ఇకపై జిన్‌టాక్, రాంటాక్ వంటి ట్యాబ్లెట్లు అత్యవసర మందుల జాబితాలో కనిపించవు. జాతీయ అత్యవసర ఔషధాల జాబితా 2022ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ విడుదల చేశారు. మొత్తం 27 కేటగిరీల్లో 384 మందులతో కొత్త జాబితా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జాబితాలోకి చేర్చడం వల్ల అనేక యాంటీబయోటిక్‌లు, టీకాలు, క్యాన్సర్ నిరోధక మందులు వంటి కీలక ఔషధాల ధరలు అందుబాటులోకి రానున్నాయని, రోగులకు మందుల ఖర్చు తగ్గుతుందని మాండవీయ వెల్లడించారు. ఎండోక్రైన్ మందులు, ఇన్సులిన్ గ్లార్గిన్, ఐవర్‌మెక్టిన్ వంటి 34 రకాల ఔషధాలను కొత్తగా జాబితాలో చేర్చారు. రనిటైడిన్, సుక్రాల్‌ఫేట్, అటినోలాల్ వంటి 26 రకాల ఔషధాలను తొలగించారు. మందుల ధరలు, ఉత్తమ ఔషధాల లభ్యత తదితర కారణాలతో ఈ మందులను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2015 తర్వాత జాతీయ అత్యవసర ఔషధాల జాబితాను అప్‌డేట్ చేయడం మళ్లీ ఇప్పుడే. 350 మందికి పైగా నిపుణులతో 140 సార్లు చర్చలు జరిపి ఈ జాబితాను తయారుచేసినట్లు కేంద్రమంత్రి మాండవీయ తెలిపారు.

ప్రముఖ యాంటాసిడ్ సాల్ట్ అయిన రనిటైడిన్ ఔషధాన్ని దేశంలో అసిలాక్, జిన్‌టాక్, రాంటాక్ వంటి బ్రాండ్లతో విక్రయిస్తున్నారు. ఎసిడిటీ, కడుపునొప్పి సంబంధిత సమస్యలకు వైద్యులు ఈ మందులను ఎక్కువగా సూచిస్తుంటారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా అమ్ముడయ్యే ఔషధాల్లో ఇది ఒకటి. అయితే ఈ ఔషధంలో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని 2019లో అమెరికా పరిశోధన ఒకటి వెల్లడించింది. దీంతో అప్పటి నుంచి ఈ ఔషధ వినియోగంపై చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బహుశా ఈ కారణం చేతే తాజాగా అత్యవసర ఔషధాల జాబితా నుంచి దీన్ని తొలగించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నర్సరీ చిన్నారిపై అఘాయిత్యం

భోపాల్: అభం శుభం తెలియని పసిపిల్లను మానవమృగం పైశాచికంగా కాటేసింది. పాఠశాల నుంచి ఇంటికి తిరిగొస్తున్న ఓ మూడున్నరేళ్ల నర్సరీ చిన్నారిపై స్కూల్ బస్సులో డ్రైవరు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణానికి అదే బస్సులో ఉన్న మహిళా సిబ్బంది ఒకరు సహకరించడం విచారకరం. సభ్య సమాజం తలదించుకునే ఈ అమానవీయ ఘటన మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో గత గురువారం చోటుచేసుకోగా..ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోపాల్‌కు చెందిన మూడున్నరేళ్ల చిన్నారి నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతోంది. రోజూ స్కూల్ బస్సులోనే వెళ్తుంది. బస్సులో ఆమెదే చివరి స్టాప్. దీంతో ఆ పసిపాపపై డ్రైవర్ కన్నుపడింది. గత గురువారం స్కూల్ నుంచి తిరిగివస్తుండగా మార్గమధ్యంలో చిన్నారిపై డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పాప బ్యాగులో మరో జత దుస్తులు ఉంటే.. వాటిని తీసి ఆమెకు మార్చాడు. ఇదంతా జరుగుతున్నప్పుడు బస్సులో ఉన్న మరో మహిళ డ్రైవర్‌కు సహకరించింది. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తెలుసుకోలేని ఆ చిన్నారి ఎప్పటిలాగే ఇంటికెళ్లింది. పాప డ్రెస్ మారడం గుర్తించిన ఆమె తల్లి.. క్లాస్ టీచర్, స్కూల్ ప్రిన్సిపల్‌ను అడగ్గా.. వారు మార్చలేదని చెప్పారు. ఆ తర్వాత కొంతసేపటికి ఆ పాప తన వ్యక్తిగత అవయవాల వద్ద నొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. దీంతో పాప తల్లిదండ్రులు ఆమెకు ధైర్యం చెప్పి అసలు విషయం అడగ్గా.. బస్సులో జరిగిన ఘటన గురించి చెప్పింది. డ్రైవర్ తన డ్రెస్ మార్చినట్లు తెలిపింది. దీంతో పాప తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్కూల్ బస్సు డ్రైవర్, మహిళా సిబ్బందిని అరెస్టు చేశారు. ఘటనపై రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా స్పందించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. స్కూల్ యాజమాన్యాన్ని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

టోల్‌ప్లాజాల స్థానే నంబర్ ప్లేట్ గుర్తింపు వ్యవస్థ

న్యూదిల్లీ: దేశంలో టోల్ ప్లాజాలను తొలగించి వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ గుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేసే దిశగా ప్రయోగాత్మక ప్రాజెక్టులను ప్రభుత్వం అమలు చేస్తున్నదని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. కొత్త వ్యవస్థ సంబంధిత వాహన యజమాని బ్యాంకు ఖాతా నుంచి రుసుము మినహాయిస్తుందని అన్నారు. గడ్కరీ మంగళవారం మైండ్‌మైన్ సదస్సులో మాట్లాడారు. ఫాస్ట్‌ట్యాగ్స్ అమలు తర్వాత ఎన్‌హెచ్‌ఏఐ టోల్ వసూళ్లు ఏటా రూ.15వేల కోట్ల మేర పెరిగాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి తెలిపారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ టెక్నాలజీ (సొంతంగా నంబరు ప్లేటును గుర్తించే కెమెరాలు) ద్వారా టోల్ ప్లాజాల అవసరం ఉండదని అన్నారు. అంతకుమించి వివరాలు ఇవ్వలేదు. 2018-19లో టోల్‌ప్లాజాల వద్ద వాహనాల నిరీక్షణ సమయం ఎనిమిది నిమిషాలు కాగా ఫాస్ట్‌ట్యాగ్ వచ్చాక అది 47 సెకన్లకు చేరింది. ఫాస్ట్‌ట్యాగ్‌లకు బదులు జీపీఎస్‌ను ప్రక్రియను అమలు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇటీవల గడ్కరీ వెల్లడించిన విషయం తెలిసిందే.

ప్రాజెక్టుల సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తాం

- వచ్చే సీజన్ నాటికి అవుకు సొరంగం పూర్తి
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర-అవుకు: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటి సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం అవుకు వద్ద గాలేరు నగరి సుజల ప్రవంతి వరద కాలువ అంతర్భాగంగా నిర్మాణం జరుగుతున్న రెండు సమాంతర సొరంగాలను నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచ బ్రహ్మానందరెడ్డి, శాసనమండలి సభ్యులు చల్లా భగీరథ్ రెడ్డి, బనగానపల్లి శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. సొరంగ నిర్మాణాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా అవుకు సొరంగ నిర్మాణాలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఒక్కొక్క సొరంగ మార్గంలో 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు నిర్మాణాలు జరుగుతున్నాయని, రెండు సొరంగ నిర్మాణాల పనులు 90 శాతం పూర్తయినట్లు మంత్రి వివరించారు. మిగిలిన 10 శాతం పనులు ఫాల్ట్ జోన్ కారణంగా అంతరాయం కలిగిందని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో త్వరలోనే వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. కొత్తగా మూడవ సొరంగ నిర్మాణం పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయని, వచ్చే సీజన్ నాటికి మూడు సొరంగ మార్గాల ద్వారా 30 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వెలిగొండ, అవుకు సొరంగ నిర్మాణాలను ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ఉన్న సమస్యలపై ఒక కమిటీని వేసి, ఆ ప్రాజెక్టుల సమస్యలను సీఎం జగన్ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ జంగయ్య కుమార్, ఎస్ఈ కబీర్ బాషా, ప్రాజెక్టు డైరెక్టర్ రాజు, జనరల్ మేనేజర్ శ్రీహరి, ఈఈ సురేష్ బాబు, డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సుబ్బరాయుడు, వైసీపీ నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, జయ చంద్రారెడ్డి, గుండం శశి రెడ్డి, ముక్కమల్ల పుల్లారెడ్డి, సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసులు, అనేక మంది డీలు, ఏఈలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి అధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబుకు ఎందుకంత ద్వేషం?

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలంటే చంద్రబాబుకు ఎందుకంత ద్వేషమని వైసీపీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అమరావతి రైతుల ముసుగులో చంద్రబాబు రహస్య ఎజెండాను పెట్టుకుని ప్రజలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ వాసిగా, ఆ ప్రాంత ప్రజా ప్రతినిధిగా, అమరావతి పాదయాత్రలో వారు మాట్లాడిన మాటలు నాకు చాలా బాధ కలిగించాయన్నారు. రాయలసీమకు న్యాయ రాజధాని వస్తే చంద్రబాబుకు వచ్చిన నష్టమేమిటో తనకు అర్థం కావడం లేదని, చంద్రబాబుకు అధికారమే పరమావధి అని ఎద్దేవా చేశారు. విభజన సమయంలో రెండు కళ్ల సిద్ధాంతంతో ఈ రాష్ట్ర విభజనకు ఆయన మూలకారకుడయ్యాడని దుయ్యబట్టారు. వెనుకబడిన ప్రాంతాలంటే చంద్రబాబుకు ఎందుకంత ద్వేషమని దుయ్యబట్టారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారే చంద్రబాబు ముఖ్యమంత్రిగా తన తొలి దశ పాలన చూస్తే, రాష్ట్రంలో ఎక్కడ చూసినా, నక్సలిజం, కరువు కాటకాలు, క్షీణించిన శాంతిభద్రతలతో రాష్ట్రం తల్లడిల్లిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారం చేపట్టాక, వాటన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రానికి సరికొత్త దశ, దిశ నిర్దేశిస్తూ, సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారని కొనియాడారు. నాడు వ్యవసాయం దండగన్న చంద్రబాబు మాటల సాక్షిగా రాష్ట్రంలో సేద్యాన్ని పండుగలా మార్చి చూపించారన్నారు. తనకు మాత్రమే విజన్ ఉందని చెప్పుకునే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పనిచేసి, రాష్ట్రాన్ని కరువు ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. అమరావతిని ప్రపంచంలో కెల్లా గొప్ప రాజధానిగా తయారు చేస్తానని, సినిమా సెట్టింగులు మాదిరిగా గ్రాఫిక్స్ చూపించారని దుయ్యబట్టారు. విశాఖపట్నం, రాయలసీమకు దూరం అవుతుందని మేము ఎప్పుడూ భావించలేదని, రాజధానిగా అన్ని వనరులు ఉన్న ప్రాంతం కాబట్టి, పరిపాలనా రాజధానిగా విశాఖ అయితేనే ఈ రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందుతుందని భావించామని అన్నారు.

తదుపరి ఏజీగా ముకుల్ రోహ్తగి!

న్యూదిల్లీ: సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగి మరోసారి అటార్నీ జనరల్(ఏజీ)గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఏజీ కేకే వేణుగోపాల్ పదవీ విరమణ తర్వాత రోహ్తగి ఈ బాధ్యతలు చేపడతారు. గతంలో ఏజీగా పనిచేసిన రోహ్తగి 2017లో ఈ బాధ్యతల నుంచి వైదొలగడం వల్ల 15వ అటార్నీ జనరల్‌గా కేకే వేణుగోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత ఏజీ వేణుగోపాల్ పదవీకాలాన్ని పొడిగించారు. అది కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగియనుంది. ఆయన ఈ పదవిలో దాదాపు 5ఏళ్లు కొనసాగుతున్నారు. 2020లోనే వేణుగోపాల్ మూడేళ్ల పదవీకాలం ముగిసింది. అప్పటికే ఆయన వయస్సు దాదాపు 89 ఏళ్లు. తన వయస్సును దృష్టిలో పెట్టుకొని విశ్రాంతి ఇవ్వాలని అప్పట్లో వేణుగోపాల్ కేంద్రాన్ని కోరారు. కానీ, కేంద్రం ఆయన్ను మరో మూడేళ్లపాటు పదవిలో కొనసాగమని అభ్యర్థించడం వల్ల ఆయన కొనసాగారు. ముకుల్ రోహ్తగి పదవీకాలం అక్టోబర్ 1 నుంచి మొదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఐపీఓ ధరల నిర్ణయం మా పని కాదు

సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురీ బుచ్

ముంబై: కొత్తతరం సాంకేతిక కంపెనీల పబ్లిక్ ఇష్యూ ధరల్ని నిర్ణయించడం స్టాక్ మార్కెట్ నియంత్రణా సంస్థ సెబీ పని కాదని సంస్థ ఛైర్‌పర్సన్ మాధవీ పురీ బుచ్ తెలిపారు. ఫిక్కీ నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్ వార్షిక సదస్సులో మంగళవారం మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ప్రీ-మార్కెట్ ప్లేస్‌మెంట్ షేరు ధరతో పోలిస్తే ఐపీఓ ధర ఎక్కువ ఉండడానికి గల కారణాన్ని టెక్ కంపెనీలు వెల్లడించాలని మాధవీ పురీ తెలిపారు. ఈ విషయాన్ని ఆమె సోదాహరణంగా వివరించారు. ఓ కంపెనీ ప్రీ-మార్కెట్ ప్లేస్‌మెంట్‌లో ఒక్కో షేరుని రూ.100కు మదుపర్లకు కేటాయిస్తే.. కొన్ని నెలల వ్యవధిలోనే ఐపీఓలో అదే షేరు ధరను రూ.450గా నిర్ణయిస్తున్నారని తెలిపారు. ధర నిర్ణయించుకునే స్వేచ్ఛ కంపెనీలకు ఉన్నప్పటికీ.. షేరు విలువలో ఒకేసారి అంత వ్యత్యాసం రావడానికి ఏం దోహదం చేసిందో వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మధ్యకాలంలో ఐపీఓకి వచ్చిన కొన్ని టెక్ కంపెనీలు.. ఇష్యూ ధరను భారీగా నిర్ణయించాయనే వాదన పరిశ్రమ వర్గాల్లో ఉంది. వాటిలో చాలా కంపెనీల షేర్లు తర్వాత పతనాన్ని చవిచూశాయి. దీంతో ముఖ్యంగా చిన్న మదుపర్లు భారీ ఎత్తున నష్టపోయారు. ఈ నేపథ్యంలోనే కొత్తతరం సాంకేతిక కంపెనీల ఐపీఓ ధరలపై సెబీ మార్గదర్శకాలు జారీ చేయాలనే డిమాండ్ వచ్చింది. అలాంటి కొన్ని కంపెనీలను ఉదహరిస్తూ వీటి విషయంలో ఏం చేయాలని సదస్సులో కొంత మంది మాధవీ పురీని ప్రశ్నించారు. దీనికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

మూడు నెలలు... భారీ నియామకాలు

న్యూదిల్లీ: దేశీయంగా అక్టోబరు-డిసెంబరులో ఉద్యోగ నియామకాలు అధికంగా జరిగే అవకాశం ఉందని మ్యాన్‌పవర్ గ్రూప్ 'ఎంప్లాయ్‌మెంట్ అవుట్‌లుక్ సర్వే' నివేదిక అంచనా వేసింది. దాదాపు 54 శాతం కంపెనీలు వచ్చే 3 నెలల్లో మరింత మంది సిబ్బందిని నియమించుకొనేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపాయని పేర్కొంది. తాజాగా భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉండడమే అందుకు కారణమని వివరించింది. మొత్తం 41 దేశాల్లో 40,600 కంపెనీలను 'మ్యాన్‌పవర్ గ్రూప్' సర్వే చేసింది. డిసెంబరు త్రైమాసికంలో 64 శాతం కంపెనీలు తమ సిబ్బందిని పెంచుకోనున్నాయి. 10 శాతం సంస్థలు తగ్గించుకోనుండగా, 24 శాతం ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని తెలిపాయి. మొత్తంగా 54 శాతం నియామకాలు జరగనున్నాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే నియామకాల్లో 10 శాతం వృద్ధి నమోదైంది. అదే ముందు త్రైమాసికంతో పోలిస్తే 3 శాతం మెరుగుపడింది. ప్రపంచంలో రానున్న మూడు నెలల్లో అత్యధిక నియమకాలు జరగనున్న దేశాల జాబితాలో బ్రెజిల్ (56 శాతం) తొలిస్థానంలో నిలవగా.. భారత్ రెండో ర్యాంకులో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని మ్యాన్‌పవర్ గ్రూప్ ఎండీ సందీప్ గులాటీ తెలిపారు. అనేక సవాళ్లున్నప్పటికీ.. ఎగుమతుల్లో పెరుగుదల, వృద్ధికి ఊతమిచ్చే విధానాలు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు వాటిని అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవృద్ధికి తోడ్పాటునందిస్తాయని గులాటీ వెల్లడించారు. అయితే, ఐటీ రంగంలో భిన్న పరిస్థితి నెలకొందన్నారు. ఆర్థిక మందగమన భయాల నేపథ్యంలో ఐటీ కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయన్నారు. ఐటీ, టెక్నాలజీ రంగాల్లో 63 శాతం, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, స్థిరాస్తి రంగాల్లో 61 శాతం మేర నిపుణులకు గిరాకీ ఉన్నట్లు మ్యాన్‌పవర్ గ్రూప్ నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా సర్వే చేసిన మొత్తం 41 దేశాల్లోకెల్లా 39 దేశాల్లో నియామకాలు పెరగనున్నాయి.

నా శాఖలో దొంగలు: బీహార్ మంత్రి



పాట్నా: వ్యవసాయ శాఖలో దొంగలు ఉన్నారని, వారికి తానే ముఖ్యుడినని బీహార్ మంత్రి సుధాకర్ సింగ్ వ్యాఖ్యానించారు. తనపై ఎంతో మంది సర్దార్లు ఉన్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్ మంత్రి, ఆర్జేడీ నేత సుధాకర్ సింగ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తన శాఖలో ఎంతోమంది దొంగలున్నారని, వారికి తానే సర్దార్ అంటూ ఆయన మాట్లాడిన తీరు రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసింది. అక్కడితో ఆగకుండా తనపైన కూడా సర్దార్లు ఉన్నారంటూ జేడీయూ, ఆర్జేడీ అగ్రనేతలను వివాదంలోకి లాగారు. 'నా వ్యవసాయ శాఖలో చోరీకి పాల్పడని విభాగం ఒక్కటీ లేదు. ఆ శాఖ నా నేతృత్వంలో నడుస్తోంది. కాబట్టి వారందరికీ నేను సర్దార్‌ను. నాపైనా ఎంతోమంది సర్దార్లున్నారు. ప్రభుత్వం మారింది. పనిచేసే తీరు మాత్రం అదే. అంతా గతంలో వలే ఉంది' అంటూ నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శనాత్మకంగా స్పందించారు. బీహార్ విత్తన సంఘంలో జరుగుతున్న అవినీతిని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రైతులను ఆదుకుంటామని చెప్తూ.. ఆ సంఘం రూ.200 కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. 2013లో నితీశ్‌కుమార్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆయనపై బియ్యం కుంభకోణానికి సంబంధించిన ఆరోపణలుండటం గమనార్హం. బీహార్‌లో నితీశ్ కుమార్ జేడీయూ పార్టీ ఇటీవలే బీజేపీ బంధం తెంచుకొని.. ఆర్జేడీతో జట్టుకట్టింది. ప్రస్తుతం జేడీయూ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది.



COMMUNIST PARTY OF INDIA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ



కమ్యూనిస్టు విప్లవం చూసి
పాలకవర్గాలు గజగజలాడాలి.
శ్రామిక వర్గానికి పోయేదేమీ
లేదు... బానిస సంకెళ్లు తప్ప!
గెలవడానికి విశ్వమంతా వారిదే!

- కార్ల్ మార్క్స్

కంభంపాటి సత్యనారాయణ (సీనియర్)

నిఖార్సైన కమ్యూనిస్టు

నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు కంభంపాటి సత్యనారాయణ సీనియర్ (1909-1983) ఒక మోపేడ్ మీద రోజూ వచ్చే వారు. లైబ్రరీలో గంటలు గంటలు గడిపేవారు. ఇలా ఆయన రాష్ట్రంలోని అనేక గ్రంథాలయాలలో గడిపారంటారు. ఆ పరిశోధన ఫలితమే "ఫ్రం స్టోన్ ఏజ్ టు ఫ్యూడలిజం" అన్న అపురూపమైన గ్రంథం.

ఈ గ్రంథ రచన వెనక ఓ ఆసక్తికరమైన కథే ఉంది. ఆయన తండ్రి తుని దివాను. కంభంపాటి సత్యనారాయణ మాత్రం 1920 నుంచి జాతీయోద్యమంలో, ఆ తరవాత కమ్యూనిస్టు పార్టీతో పెనవేసుకు పోయారు. రైతులను సమీకరించి ఉద్యమం లేవదీయడం తండ్రికి నచ్చలేదు. తండ్రి మరణశయ్య మీద ఉన్నప్పుడు కంభంపాటి (సీనియర్) సేవ చేశారు. తండ్రి పశ్చాత్తాపపడి తన దగ్గర మిగిలిన పది వేల రూపాయలు సీనియర్‌కు ఇచ్చారు. ఆ డబ్బే ఆయన చరిత్ర పరిశోధనకు వినియోగించారు.

అంతకుముందు కంభంపాటి కమ్యూనిస్టు పార్టీలో పూర్తికాలం పనిచేస్తే నెలకు రూ. 25 ఇచ్చేవారు. నెల ఖర్చులు పోను మిగిలిన డబ్బు సీపీఐకి వెనక్కు ఇచ్చేసేవారు. కంభంపాటి ఆంధ్రలో తొలి కమ్యూనిస్టు. కమ్యూనిస్టు అంటే ఎలా ఉండాలో జీవితాంతం అలాగే ఉన్నారు.

కాకినాడలో చదువుకొంటూండగా సహాయ నిరాకరణోద్యమంవల్ల ప్రభావితుడై టౌన్‌హాలులో పట్టణ, జిల్లా కాంగ్రెస్ నాయకులిచ్చే ఉపన్యాసాల్ని విడవకుండా విని ఒళ్లు మరిచిపోయే వారు. కొన్నాళ్ళ తర్వాత కంభంపాటి కూడా ఖద్దరు ధరించడం ప్రారంభించారు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభ దృశ్యాలు ఆయనను ఉత్సాహపరిచాయి. పి.ఆర్.కాలేజీలో చదువుతుండగా, 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని, టౌన్‌హాల్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైనప్పుడు సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో స్వామి కుమారానంద్ అహింసా విధానాన్ని దుయ్యబడుతూ ఉపన్యసిస్తూంటే, ఒళ్ళు గగుర్పొడిచేదనేవారు కంభంపాటి.

మద్రాసులో విద్యార్థిగా ఉండగా టెర్రరిస్టు విప్లవ సంస్థ "సోదర సమితి"లో చేరారు. రహస్య కార్యకలాపాలు కొనసాగించారు. 1930లో భీమవరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1931లో కరాచీ కాంగ్రెస్‌కు హాజరయ్యారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం వచ్చిన అమీర్ హైదర్‌ఖాన్ సాహచర్యంతో ఆంధ్ర ప్రాంతంలో తొలి కమ్యూనిస్టు అయ్యారు. "వీర భారత్" రహస్య పత్రిక నడిపారు. ఆ కారణంగానే ఆరు నెలల శిక్ష పడింది. 1931 జనవరి 26న భీమవరం వెళ్ళి, తనికెళ్ళ చలపతితో కలిసి 144వ సెక్షన్ ధిక్కరించి జైలుకెళ్లారు. ఉద్యమం ఉచ్ఛస్థాయిలో ఉన్న తరుణంలో, తానుకోరిన 11 కోరికల్లో ఏదీ సిద్ధించకపోయినా గాంధీజీ ఉద్యమాన్ని విరమించినందుకు కంభంపాటి నిరాశపడ్డారు.

1930 జూన్‌లో చట్టధిక్కరణ చేసి సుందరయ్య అరెస్టు అయిన తరవాత కంభంపాటి తూర్పు గోదావరి జిల్లాకు వెళ్ళి డాక్టరు చెలికాని రామారావుతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆఫీసు(కాకినాడ)లో పనిచేశారు. "రణదుందుభి"అనే పేరుతో రహస్య సైక్లోస్టయిల్ పత్రిక నడిపారు. కొంతకాలం "వీర భారతి" పత్రిక నడిపారు. 1933లో మద్రాసులో టంగుటూరి ప్రకాశం పంతులు నిర్వహించిన "స్వరాజ్య" పత్రికకు కొంతకాలం విలేకరిగా ఉన్నారు. అప్పటికి ఇంటర్ చదువుతున్న పుచ్చలపల్లి సుందరయ్య, మరికొందరు విద్యార్థులతో "సోదర సమితిగా"ఏర్పడి, కాలేజీ హాస్టల్‌లో ప్రతి ఆదివారం ఖద్దరు విక్రయించేవారు. 1935లో పత్రికా చట్టం కింద అరెస్టయి కడలూరు జైలులో ఉన్నారు.

కంభంపాటి కమ్యూనిస్టు సాహిత్యంపట్ల ఆకర్షితులయ్యారు. "ది ఇలస్ట్రేటెడ్ హిస్టరీ ఆఫ్ రష్యన్ రివల్యూషన్"మొదలైన పుస్తకాలు, మీరట్ కుట్రకేసు నిందితుల స్టేట్ మెంట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీద వారు విసిరే సవాళ్ళు ఆయనను ఆకట్టుకున్నాయి. గుంటూరులో ఒక వ్యక్తిగత విప్లవవాద గ్రూపులో చేరి పనిచేశారు.

1935-36లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. 1938లో "నవశక్తి" పత్రిక ప్రారంభించి ప్రపంచ యుద్ధ కాలంలో మూసేసే దాకా సంపాదకుడిగా ఉన్నారు. తరువాత వెల్లూరు, రాయవెల్లూర్‌లో జైలు జీవితం గడిపారు. 1942 నుంచి సీపీఐ నడిపిన ప్రజాశక్తి వారపత్రికలో, తరువాత 1946లో దినపత్రికగా వెలువడితే అందులో సంపాదక మండలి సభ్యులుగా ఉన్నారు. 1947లో, 1948లో అరెస్టయ్యారు. 1952 జూన్ 22న ప్రారంభమైన "విశాలాంధ్ర" దినపత్రికలో 1956 దాకా సంపాదకమండలి సభ్యులుగా ఉన్నారు. 1956 నుండి 1962 దాకా సిద్ధాంత పత్రిక "సందేశం" సంపాదకులుగా వ్యవహరించారు. 1962-1965 మధ్య విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకులుగా ఉన్నారు.

తండ్రితో ఆయన విభేదాలు ఎంత తీవ్రమైనవంటే 1937లో తుని నియోజక వర్గం నుంచి తుని దివానుగా ఉన్న తండ్రి పీపుల్స్ పార్టీ తరఫున పోటీ చేస్తే కొడుకు కంభంపాటి సీనియర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగారు.

1967 నుంచి చరిత్ర పరిశోధనలో నిమగ్నమై మార్క్సిస్టు దృక్పథంతో "ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి" వెలువరించారు. అనేక ప్రామాణిక సైద్ధాంతిక గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. "ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర" రాస్తూ ఉండగా 1983 జనవరి 16న మరణించారు.

-భరద్వాజ

ఎర్ర విత్తులు నాటిన డాంగే

సంస్కృతం బాగా తెలిసిన వారు కమ్యూనిస్టు కావడం ఏమిటి అని చాలామంది ఆశ్చర్యపోతూ ఉంటారు. భారత్‌లోని తొలి తరం కమ్యూనిస్టు అగ్రనాయకుల్లో చాలా మందికి సంస్కృతం వచ్చు. అలాంటి వారిలో శ్రీపాద అమృత డాంగే (ఎస్.ఎ.డాంగే) ప్రసిద్ధులు. 1899 అక్టోబర్ 10న జన్మించిన డాంగే భారత కమ్యూనిస్టు వ్యవస్థాపకుల్లో ఒకరు. కార్మికోద్యమ నిర్మాత. ఆయన ఒక్క పిలుపిస్తే బొంబాయి మొత్తం స్తంభించేది.

బొంబాయిలో టాటాలకు విద్యుదుత్పత్తి, పంపిణీ సదుపాయం ఉండేది. అందువల్ల టాటా కాస్త అహంకారం ప్రదర్శించి భగవంతుడు ఒక్క పగటి పూట మాత్రమే వెలుగు నింపుతాడు నేను దివారాత్రాలు వెలుగులందిస్తాను అన్నాడు. దీనితో డాంగేకు ఒళ్లు మండుకొచ్చి బొంబాయిలో కార్మికుల సమ్మెకు పిలుపు ఇచ్చారు. రాత్రి పూట అంధకారం అలుముకుంది. డాంగే హాస్య ప్రియుడు. ఆయన వ్యంగ్యాస్త్రాలు మాడు పగులగొట్టేవిగా ఉండేవి. టాటా విషయంలో ఆ వ్యంగ్య, హాస్యాలకు కార్య రూపం ఇచ్చారు. అంతే. కమ్యూనిస్టు కార్యకలాపాల, కార్మికోద్యమంవల్ల డాంగే అనేక సార్లు అరెస్టయ్యారు. మొత్తం 13 ఏళ్ల జైలులో గడిపారు.

1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. 1978 దాకా ఆయన సీపీఐ చైర్మన్‌గా ఉన్నారు. సీపీఐకి అంతకు ముందుగానీ, ఆ తరవాతగానీ చైర్మన్ ఎవరూ లేరు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా నిఫహాడ్ తాలూకాలో కరంజ్ గావ్‌లో ప్రభుత్వోద్యోగం చేస్తూ, మంచి భూవసతి ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన ఇల్లు ఓ రాజభవనంలా ఉండేది. తిరుగుబాటు తత్వంగల డాంగే పుణేలో చదువుకుంటున్నప్పుడు బైబిల్ బోధించడానికి వ్యతిరేకంగా ఉద్యమం లేవదీస్తే పాఠశాల నుంచి బహిష్కరించారు. క్రమంగా డాంగే కార్మికుల స్థితిగతులు గమనించడం మొదలైంది. బట్టల మిల్లుల కార్మికుల మధ్య స్వచ్ఛందంగా పని చేసేవారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయోద్యమం డాంగేను ఆకర్షించింది. స్వరాజ్యం నా జన్మ హక్కు అని చాటిన బాల గంగాధర తిలక్ డాంగేను ఆకట్టుకున్నారు. 1920లో గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపు ఇస్తే చదువు వదిలేసి ఆ ఉద్యమంలోకి దూకారు.

1917నాటి రష్యాలో అక్టోబర్ విప్లవ పరిణామాలు డాంగేను మార్క్సిజం మీదకు దృష్టి మళ్లించాయి. కుటీర పరిశ్రమలే భారత ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచగలవన్న గాంధీ వాదన డాంగేకు రుచించలేదు.

గాంధీ-లెనిన్‌ను తులనాత్మకంగా పరిశీలించి 1921లో డాంగే ఓ గ్రంథం రాశారు. ఇదే డాంగే జీవితానికి మేలి మలుపు. మార్క్సిస్టు పండితుడు ఎం.ఎన్.రాయ్ ఈ గ్రంథం చదివి డాంగేను కలుసుకున్నారు. మార్క్సిజం అధ్యయనానికి డాంగేకు బాగా సహకరించిన లోట్వాలాతో కలిసి మార్క్సిస్టు సాహిత్య గ్రంథాలయం నెలకొల్పారు. ప్రామాణిక గ్రంథాలను అనువదించారు. లోట్వాలా సహాయంతోనే డాంగే మొట్టమొదటి భారత మార్క్సిస్టు పత్రిక "సోషలిస్టు" ప్రారంభించారు. డాంగే వ్యాసాలు లెనిన్‌ను కూడా ఆకట్టుకున్నాయి.

ఎం.ఎన్.రాయ్ 1920లో మాస్కో వెళ్లారు. లెనిన్‌ను కలుసుకున్నారు. గాంధీ-లెనిన్ మీద డాంగే రాసిన గ్రంథం రాయ్‌ను బాగా ఆకర్షించింది. రాయ్ అంతకు ముందే అనుశీలన్ సమితిలో ఉండేవారు. అక్టోబర్ విప్లవం తరవాత 1919లో మూడవ ఇంటర్నేషనల్ లేదా కొమింటర్న్ మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చింది. కొమింటర్న్ ఏర్పాటు బ్రిటిష్ పాలకులలో అనుమానాలు రేకెత్తించింది. కమ్యూనిస్టు భావాలున్న వారిపై అనేక కుట్ర కేసులు మోపింది. మీరట్ కుట్రకేసు, కాన్పూర్ కుట్ర కేసుల్లో డాంగే జైలుశిక్ష అనుభవించారు. కాన్పూర్ కుట్రకేసులో నిందితుడు కావడంతో డాంగే పలుకుబడీ పెరిగింది.

1935 డిసెంబర్‌లో కాన్పూర్‌లో జరిగిన వివిధ కమ్యూనిస్టు బృందాల సమావేశం కమ్యూనిస్టు పార్టీ అవతరణకు దారి తీసింది. 1920లో బొంబాయిలో ఏ.ఐ.టి.యు.సి. ఏర్పడింది. 1923లో మిల్లు కార్మికులు ముంబైలో గిర్నీ కాంగార్ మహామండల్ ప్రారంభించారు. ఈ సంఘం తరఫున 1924లో పెద్ద సమ్మె జరిగింది. కార్మికవర్గాన్ని కమ్యూనిస్టు పార్టీ ఛత్రం కిందకు సమీకరించింది డాంగే. గిర్నీ కాంగార్ మండల్‌లో చీలిక కమ్యూనిస్టులు గిర్నీ కాంగార్ యూనియన్ స్థాపించడానికి దారి తీసింది. 1928లో దీని తరఫున సార్వత్రిక సమ్మె జరిగింది. ఈ యూనియన్‌లో చురుకుగా ఉన్నందుకు ముజఫ్ఫర్ అహమద్, షౌకత్ ఉస్మానీతో పాటు డాంగేను అరెస్టు చేశారు. ఈ సంఘం తరఫున డాంగే "క్రాంతి" పత్రిక నడిపేవారు.

డాంగేతో సహా 32 మందిపై మోపిన మీరట్ కుట్ర కేసు సీపీఐ బలపడడానికి తోడ్పడింది. ఈ కేసులో 1933లో డాంగేకు 12 ఏళ్ల శిక్ష పడింది. ఆ తరవాత డాంగే, ముజఫ్ఫర్ అహమద్, ఉస్మానీ శిక్షను మూడేళ్లకు తగ్గించారు. 1935లో మీరట్ కుట్రకేసులో జైలునుంచి విడుదలైన తరవాత డాంగే ఆంధ్ర ప్రాంతంలో పర్యటించడంవల్ల అనేకమంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1946లో డాంగే బొంబాయి శాసనసభకు, 1957లో, 1967లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఎమర్జెన్సీ సమయంలో సీపీఐ ఇందిరాగాంధీని సమర్థించడం పార్టీ మీద తీవ్ర ప్రభావం చూపినట్టే డాంగే రాజకీయ భవిష్యత్తును కూడా ప్రభావితం చేసింది. భటిండా మహాసభలో సీపీఐ తప్పు దిద్దుకున్నా డాంగే వైఖరి కాంగ్రెస్‌కు అనుకూలంగానే సాగింది. 1980నాటికి డాంగే ఒంటరివాడు కావడం మొదలైంది. ఉభయ కమ్యూనిస్టు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదిరింది. కేరళలో కాంగ్రెస్‌తో సీపీఐ తెగదెంపులు చేసుకుంది. ఈ క్రమంలో సీపీఐలో డాంగే దయనీయమైన మైనార్టీలో పడిపోయారు. కాంగ్రెస్‌కు చేరువగా ఉండాలనుకున్న వారు సీపీఐ నుంచి విడిపోయి ఆల్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ (ఏ.ఐ.సి.పి.) ఏర్పాటు చేశారు. ఇందులో డాంగే కూతురు రోజా దేశ్ పాండే, అల్లుడు బానీ దేశ్ పాండేదే కీలక పాత్ర. 1981లో సీపీఐ నుంచి డాంగేను బహిష్కరిస్తే. ఎ.ఐ.సి.పి.కి మొదటి ప్రధాన కార్యదర్శి అయ్యారు. బానీ దేశ్ పాండే రాసిన యూనివర్స్ ఆఫ్ వేదాంత గ్రంథానికి డాంగే రాసిన సుదీర్ఘమైన ముందుమాట వివాదాస్పదమైంది. 1991 మే 22న డాంగే బొంబాయిలో మరణించారు. ఎన్ని ఒడుదుడుకులున్నా కమ్యూనిస్టు ఉద్యమంలో డాంగే పాత్ర విస్మరించడానికి వీలు లేనిది.

-ఆర్వీ

చలించని భూపేశ్ కంఠధ్వని

భూపేశ్ గుప్తా. ఈ పేరు వింటేనే భారత పార్లమెంటు ప్రధానంగా రాజ్యసభ చరిత్ర కళ్ల ముందు మెదలాడుతుంది. రాజ్యసభ ఏర్పడినప్పటి నుంచి 1981 ఆగస్టు ఆరున మాస్కోలో మరణించేదాకా ఆ సభ సభ్యుడిగా ఉన్న ఏకైక వ్యక్తి ఆయనే. రాజ్యసభలో భూపేశ్ ఒక సంచలనం. ఆయనది ఎవరికీ లొంగే మనస్తత్వం కాదు. ఆయన రాజ్యసభలో ఉన్నన్నాళ్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఎవరికీ లొంగని భూపేశ్ అన్న విశేషణం లేకుండా రాసేదే కాదు. 1952 ఏప్రిల్ మూడవ తేదీన ఆయన మొదటి సారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ మొదటి సమావేశం 1952 మే 13 న ప్రారంభమైంది. ఆ తరవాత వరసగా 1958, 1964, 1970, 1976 లో రాజ్యసభకు ఎన్నికవుతూనే వచ్చారు. రాజ్యసభలో ఆయనది మహామూర్తిమత్వం.

1962 లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు భూపేశ్ చైనా దురాక్రమణను నేరుగా ఖండించే వారు కాదు. ఆ తరవాత చైనా వైపు మొగ్గిన వారు సీపీఐ నుంచి చీలిపోయి సీపీఐ (ఎం) ఏర్పాటు చేసుకున్నారు. కానీ భూపేష్ సీపీఐలోనే ఉండి పోయారు. భూపేశ్ గుప్తా మొదటి నుంచి చివరిదాకా అచంచల దేశభక్తుడిగానే ఉన్నారు. అప్పుడు తూర్పు బెంగాల్‌లో భాగమైన మైమెన్ సింగ్ జిల్లా ఇత్నాలో 1914 అక్టోబర్ 20 న జన్మించారు. కోల్కతాలోని స్కాటిష్ చర్చ్ కళాశాలలో విద్యాభ్యాసం సాగింది. ఆ తరవాత లండన్‌లోని మిడిల్ టెంపుల్‌లో చదువుకున్నారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే బెంగాల్ విప్లవకారులతో కలిసి పని చేశారు. నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించారు. అప్పుడే వినికిడి శక్తి కోల్పోయారు. దాన్ని కూడా రాజ్యసభలో సద్వినియోగం చేసుకునే వారు. మాట్లాడేటప్పుడు వినికిడి పరికరం తీసేసేవారు. ఆ సమయంలో రాజ్యసభ అధ్యక్షులు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ కిటుకు కనిపెట్టి "భూపేశ్ మీ సంగతి నాకు తెలుసు. మీకిచ్చిన సమయం పూర్తి అయింది" అని హెచ్చరించే వారు.

కలకత్తాలో విద్యాభ్యాసం తరవాత లండన్ వెళ్లి అక్కడ ఇండియా లీగ్ చేపట్టిన బ్రిటిష్ వ్యతిరేక ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. భారత్‌కు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించే వారు. వినికిడి సమస్య ఉన్నా చాలా చురుకుగా ఉండి బ్రిటిష్ పోలీసుల కన్నుగప్పి తిరిగే వారు. వయసుతో నిమిత్తం లేకుండా అందరితో స్నేహం చేసే వారు. అక్కడే ఫెరోజ్ గాంధీ, ఇందిరా గాంధీ తో మైత్రి కుదిరింది. రాజకీయంగా ఒడిదుడుకులతో నిమిత్తం లేకుండా ఈ స్నేహం కొనసాగించారు. సుదీర్ఘ కాలం బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న జ్యోతి బసుతో కూడా ఈ స్నేహమే కొనసాగింది. ఫెరోజ్, భూపేశ్, ఇందిరా గాంధీ రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఒకే నౌకలో స్వదేశం తిరిగి వచ్చారు.

వచ్చీ రాగానే భూపేశ్ అజ్ఞాత కార్యకలాపాల్లో నిమగ్నమై పోయారు. 1941 లో అజ్ఞాతవాసం వదిలిన తరవాత పి.సి.జోషీతో కలిసి పని చేశారు. జ్యోతిబసుతో కలిసి సోవియట్ మిత్ర మండలి ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత భూపేశ్ బెంగాల్‌లో రాజకీయ నాయకుడిగా ప్రతిష్ఠ సంపాదించారు.

పార్లమెంటు లోపల వెలుపల కాంగ్రెస్‌ను తూర్పారబట్టడానికి ఎన్నడూ వెనుకాడని నిర్భీకత భూపేశ్ సొంతం. వామపక్ష ఐక్యత కోసం పాటుపడే వారు. వామపక్షాలు ఐక్యం కాకపోతే కాన్సంట్రేషన్ క్యాంపుల్లో అందరం ఏకం కావలసి వస్తుందని హెచ్చరించిన క్రాంతిదర్శి ఆయనే.

-అనన్యవర్మ

భూపేశ్ రాజ్యసభలో చాలా సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు. భూపేశ్‌గుప్తా మాట్లాడుతున్నారంటే పార్లమెంటు ఆవరణలో ఎక్కడ ఉన్నా నెహ్రూ సభలోకి పరుగెత్తుకొచ్చే వారు. ఆయనంటే అంత ఆదరణ ఉండేది. నిర్భయంగా, ముక్కుకు సూటిగా మెదలడం ఆయన తత్వం. అటల్ బిహారీ వాజపేయి రాజ్యసభ సభ్యుడిగానే కాక జనతా పార్టీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడూ సభలోకి ప్రవేశించగానే భూపేశ్ కూర్చున్న చోటికి వెళ్లి నమస్కరించిన తరవాత కానీ తాను ఆసీనులయ్యే వారు కాదు. ఇందిరాగాంధీతో సాన్నిహిత్యం ఉన్నా రాజకీయాల దగ్గరకొచ్చే సరికి భూపేశ్ ఏ మాత్రం రాజీ పడేవారు కాదు. ఎమర్జెన్సీని సీపీఐ సమర్థించినా క్రమంగా అది కుక్క మూతి పిందెలు వేయడం గ్రహించి "ఇప్పటికిప్పుడే ఎమర్జెన్సీ తొలగించండి" అని మొట్ట మొదట బెంగళూర్ సీపీఐ జాతీయ సమితి సమావేశంలో గర్జించిన గొంతు భూపేశ్ దే.

పశ్చిమబెంగాల్‌లోని బలూర్‌ఘాట్‌లో తెభాగా ఉద్యమం

స్ఫూర్తి దాయకం తెభాగా రైతు ఉద్యమం

వలస పాలనలోనూ 'స్వతంత్ర' పాలనలోనూ భారత దేశంలో అనేక రైతాంగ ఉద్యమాలు, పోరా టాలు జరిగాయి. ఆ పోరాటాలు ఎక్కువగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలుగా ఉన్నాయి. ఏ పోరాటాన్ని గమనించినా వర్గ దృక్పథంతో మిలిటెంట్‌గా జరిగినవే. అలాంటి పోరాటాల్లో ఒకటి తెభాగ రైతాంగ పోరాటం. ఈ పోరాటం స్వాతం త్ర్యానికి ఒక సంవత్సరం ముందు ప్రారంభమైనది. తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం కూడా 1946లోనే ప్రారంభమైంది. భూస్వామ్య వ్యవస్థలో కౌలు దోపిడీ ప్రధానమైనది. భూమిపై గుత్తాధిపత్యం గలిగి భూస్వామ్య వర్గం భూమి లేని పేదలకు భూములను కౌలుకిచ్చి వారు పండించిన పంట నుండి ఎటువంటి శ్రమ చేయకుండా కౌలు రూపంలో ధాన్యం తరలించుకు పోయేవారు. తెభాగ రైతాంగం కూడా ఇలాంటి కౌలు దోపిడీకి గురయ్యారు.

తెభాగ ప్రాంతం బెంగాల్ ప్రాంతంలోని 24 పరగణాల జిల్లాలోనిది. ఇక్కడి పేద రైతులకు సేద్యం జీవనాధారంగా ఉంది. వీరికి సొంతభూమి లేదు. భూమి లేని వీరికి తమ భూములను భూస్వాములు పేద రైతులకు కౌలుకి ఇచ్చి పండిన పంటలో సగం తమకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కౌలు అధికంగా ఉండటం వలన ఈ ఒప్పందం రైతాంగానికి నష్ట దాయకమైంది. కష్టపడి పండించిన పంటలో సగం పైగా భూస్వామికే ఇవ్వాల్సి రావటం వల్ల కౌలు రైతులకు మిగిలేది చాలా తక్కువగా ఉండేది. ఫలితంగా అత్యంత పేదరికంలో కుటుం బాలు ఉండేవి. ఇలాంటి సమయంలో బెంగాల్‌లో 1943 తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతాంగం తీవ్రంగా నష్టపోయారు .ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 24 పరగణాల జిల్లాలోని సుందర్బన్స్ ప్రాంతంలో ప్రాంతీయ కిసాన్ సభ కౌలు రైతుల సమస్యలను అధ్యయనం చేసి కౌలు తగ్గింపు ఉద్యమ ప్రచారం రైతాంగంలో విస్తృతంగా చేసింది. ఫలితంగా రైతాంగంలో మంచి స్పందన ఏర్పడింది. కౌలు రైతులందరినీ కిసాన్ సభ సంఘటిత పర్చింది. కౌలు తగ్గింపు డిమాండ్ పెట్టింది. పండిన పంటలో సగం కాకుండా మూడవ వంతు మాత్రమే భూస్వామికి ఇస్తామని ప్రకటించింది. కిసాన్ సభ నాయకత్వాన 1946లో కాద్వీప్, సోనార్పూర్, బాంగర్, కాలింగ్‌లలో కౌలు తగ్గింపు నినాదంతో రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. ఉద్య మంలో ముస్లింలు, హిందువులు కలిసికట్టుగా పాల్గొన్నారు.

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈ ఉద్యమ ప్రభావం ఏర్పడింది. సమస్య పరిష్కార మయ్యేంత వరకు ధాన్యం చెల్లింపుని నిరాకరించి తమ వద్దనే రైతాంగం నిల్వపెట్టారు. ఉద్యమం జాగీర్దార్ల (భూస్వాములు)కు,బార్గ దార్ల(కౌలు రైతులకు) మధ్య తీవ్ర వైరుధ్యంగా మారింది. భూస్వాముల దౌర్జన్యా లను, కుట్రలను, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని ప్రారంభమైన ఈ ఉద్యమం 1946 నుండి 1947 వరకు సాగింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారం భం కావటంతో ప్రావిన్స్‌లోని ముస్లిం లీగ్ మంత్రిత్వ శాఖ ల్యాండ్ రెవిన్యూ కమిషన్‌ను నియమించింది. ప్రభుత్వానికి ఈ కమిషన్ ఇచ్చిన నివేదిక కౌలు దార్ల డిమాండ్‌కి అనుగుణంగా ఉంది. ఉద్యమం ఉధృతం కావటంతో బెంగాల్ ముస్లింలీగ్ మంత్రిత్వ శాఖ బార్గదారీ (కౌలుదారీ) చట్టాన్ని చేయక తప్పలేదు. చట్ట ప్రకారం కౌలుదార్లు పంటలో మూడవ వంతు భూస్వామికి చెల్లించాలి. చట్టంలో రైతుల డిమాండ్ నెరవేరినా ఆచరణలో పూర్తిగా అమలు జరపలేదు. 1950 లో గాని చట్టం అమలులోకి రాలేదు. అప్పటి దాకా వివిధ రూపాల్లో ఉద్యమం కొనసాగింది.

1946 నుండి 47 వరకు జరిగిన తెభాగ రైతాంగ ఉద్యమానికి కామ్రేడ్స్ ఇలామిత్ర, కన్‌సారీహర్, మణిసంగ్, బిష్ణు చట్టోపాధ్యాయ, ఎం.ఎ.రసూల్, మణిగుహ, చారుమజుందార్, అదానీ లహరి, గురుదాస్ తాలూక్‌దర్, సమర్ గంగూలీ, బిమల మాజీ, సుధీర్ ముఖర్జీ, స్నుదీపాసేన్, మణికృష్ణసేన్, బుడీమా తదితరులు నాయకత్వం వహించారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో కూడా అనేక రైతాంగ ఉద్యమాలు జరిగాయి. మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కూడా 1946 లో ప్రారంభమైన 1951 వరకు కొనసాగింది. కౌలు తగ్గింపు, భూమిపై దున్నే వానికే హక్కు, వెట్టి చాకిరి రద్దు మొదలైన డిమాండ్లతో ఈ ఉద్యమం ప్రారంభమైంది. ఆ పోరాట ప్రభావం దేశంలోని అనేక ప్రాంతాలను ప్రభావితం చేసింది. నెహ్రూ ప్రభుత్వ ఈ ఉద్యమాన్ని చూసి భయపడింది. తెలంగాణ, తెభాగ మొదలైన రైతాంగ పోరాటాలు ఫలితంగా నెహ్రూ నాయకత్వాన ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలుదారీ చట్టాన్ని చేయక తప్ప లేదు.

చట్టం చేసే అధికారాన్ని రాష్ట్రాలకు ఇచ్చింది. ఆ అధికారంతో 1950 లో చేసిన తెలంగాణ ప్రాంత కౌలుదారీ చట్టం, 1956లో ఆంధ్ర కౌలుదారీ చట్టం. కౌలు రైతులకు ఆచరణలో హక్కులు కల్పించలేక పోయాయి. రాష్ట్ర పాలకుల ఉద్దేశ పూర్వకంగా చట్టాలను నీరు గార్చటమే అందుకు కారణం. నేడు దేశం లోనూ, రాష్ట్రంలోనూ కౌలు రైతులు ఎటు వంటి హక్కులు లేకుండా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కౌలు దోపిడీ ఎక్కువగా సాగుతు న్నది. కౌలుదారీ చట్టాలు అలంకార ప్రాయంగా ప్రభుత్వాలు మార్చి పూర్తిగా రద్దు చేసే చర్యలు తీసుకుంటున్నాయి. కౌలు దారులకు రక్షణ లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కౌలు రైతులు తెభాగ రైతాంగ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని కౌలు భూమిపై చట్టబద్ధ కౌలు హక్కుల కోసం ఉద్యమించి సాధించుకోవాలి.

బొల్లిముంత సాంబశివరావు

బెంగళూరులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

బెంగళూరు: బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) ఆధ్వర్యంలో చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు మంగళవారం కూడా కొనసాగింది. నగరంలోని మహదేవపూర్ మండలంలోని శాంతినికేతన లేఅవుట్ సహా వివిధ ప్రాంతాల్లో కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలతోనే వరద ముంపు ఏర్పడిన నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ఆ అక్రమ కట్టడాలను బీబీఎంపీ అధికారులు కూల్చివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో భారీ వరదలు తలెత్తాయి. ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కారిడార్, ఆర్టీరియల్ రోడ్లు ఉన్న ప్రాంతాలు ఆక్రమణలకు గురవడంతో వరద నీరు జనావాసాల్లోకి రావడంతో నగరంలోని చాలా ప్రాంతాలు నీటమునిగాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే అక్రమ కట్టడాలను కూల్చి వేయడం కోసం ప్రత్యేకంగా సోమవారం నుంచి డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అక్రమకట్టడాల కూల్చివేతకు ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. అక్రమ కట్టడాల్ని నిర్మించుకున్న వారు ఎంతటిశక్తివంతులైనా ఆ కట్టడాలను కూల్చివేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బీబీఎంపీ అధికారులు కేవలం పేద వర్గాలకు చెందిన నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతుండడంతో రెవెన్యూశాఖ మంత్రి ఆర్ అశోక స్పందించారు. తమ శాఖ అధికారులు తయారు చేసిన ఆక్రమణల జాబితాను బీబీఎంపీకి అందించామని చెప్పారు.

జి20 అధ్యక్ష హోదాలో

200 సమావేశాలకు భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: భారతదేశం జి20 అధ్యక్ష పదవిలో 200 సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 9, 10 తేదీలలో వార్షిక శిఖరాగ్ర సమావేశంతో ముగుస్తుంది. డిసెంబరు 1, 2022 నుంచి 30 నవంబర్ 2023 వరకు ఒక సంవత్సరం పాటు భారత్ జి20 అధ్యక్ష పదవిని చేపట్టనుంది. 'భారతదేశం తన అధ్యక్షతన డిసెంబర్ 2022 నుంచి దేశవ్యాప్తంగా 200కి పైగా జి20 సమావేశాలకు ఆతిథ్యం ఇస్తుందని భావిస్తున్నారు. దేశాధినేతల స్థాయి, ప్రభుత్వ స్థాయి జి20 నేతల సదస్సు సెప్టెంబర్ 9, 10, 2023 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్నది' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) మంగళవారం తెలిపింది. జి20 లేదా గ్రూప్ ఆఫ్ 20 అనేది ప్రపంచంలోని ప్రధాన అభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అంతర్ ప్రభుత్వ ఫోరమ్. ఇందులో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఉన్నాయి. ఈ జి20 దేశాలు అంతర్జాతీయ జీడీపీలో సమష్టిగా 85 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం కలిగి ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడవ వంతు వీటిదే. దీంతో అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ఇది ప్రధాన వేదికగా మారింది. భారతదేశం ప్రస్తుతం ఇండోనేషియా, ఇటలీతో కూడిన జి20 త్రయం (ప్రస్తుత, మునుపటి, రాబోయే జి20 ప్రెసిడెన్సీలు)లో భాగం. భారతదేశం అధ్యక్ష హోదా కలిగి ఉన్న సమయంలో భారతదేశం, ఇండోనేసియా, బ్రెజిల్ త్రయం ఏర్పడ్డాయి. ఈ మూడు అభివృద్ధి చెందుతున్న దేశాలు, వర్ధమాన ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉండటం, వారికి గొప్ప స్వరాన్ని అందించడం ఇదే మొదటిసారి అని ఎంఈఏ తెలిపింది. జి20 సభ్య దేశాలతో పాటు జి20 అధ్యక్ష హోదాలో సమావేశాలు, శిఖరాగ్ర సమావేశాలకు కొన్ని అతిథి దేశాలను, అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించే సంప్రదాయం ఉంది. దీని ప్రకారం, ఐక్యరాజ్య సమితి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ వంటి సాధారణ అంతర్జాతీయ సంస్థలలతో పాటు జి20 అధ్యక్ష పదవిలో భారతదేశం... బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నెదర్లాండ్స్, నైజీరియా, ఒమన్, సింగపూర్, స్పెయిన్, యూఏఈ అతిథి దేశాలుగా ఆహ్వానించనున్నదని విదేశాంగ శాఖ తెలిపింది. అలాగే ఐఎస్ఏ (అంతర్జాతీయ సౌర కూటమి), సీడీఆర్ఐ (విపత్తు స్థితిస్థాపకత మౌలిక సదుపాయాల కూటమి), ఏడీబీ (ఆసియా అభివృద్ధి బ్యాంకు) లను కూడా అతిథులుగా ఆహ్వానించనున్నట్లు వివరించింది. 'మా జి20 ప్రాధాన్యతలు స్థిరపడే ప్రక్రియలో ఉండగా, పరస్పర చర్చలతో సమానమైన, స్థిరమైన వృద్ధి చుట్టూ తిరుగుతాయి. లైఫ్ (పర్యావరణానికి జీవనశైలి), మహిళా సాధికారత, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యవసాయం వరకు ఉన్న రంగాలలో సాంకేతికతతో కూడిన అభివృద్ధి' అని పేర్కొంది. అలాగే విద్య, వాణిజ్యం, నైపుణ్యం-మ్యాపింగ్, సంస్కృతి, పర్యాటకం, వాతావరణ ఆర్థిక సహాయం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ ఆహార భద్రత, ఇంధన భద్రత, హరిత ఉదజని, విపత్తు ముప్పు తగ్గింపు, స్థితిస్థాపకత, అభివృద్ధి సహకారం, ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా పోరాటం, బహుపాక్షిక సంస్కరణలు ఇతర ముఖ్య రంగాలుగా ఉన్నట్లు ఎంఈఏ తెలిపింది.

కాళ్లు బొబ్బలు కట్టినా ఆగేది లేదు

సమైక్య భారతమే లక్ష్యం: రాహుల్ గాంధీ

తిరువనంపురం: సమైక్య భారతమే తమ లక్ష్యమని, భారత్ జోడో యాత్ర జోరుగా సాగుతోందని మంగళవారానికి మూడవరోజుకు చేరుకుందని కాంగ్రెస్ తెలిపింది. కేరళలో మంచి ఆదరణ పొందుతూ నూతన ఉత్సాహంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెంట భారీ సంఖ్యలో మద్దతుదారులు గొడుగులు కూడా లేకుండా కదం తొక్కుతున్నారన్నది. భారత్ ఐక్యతే లక్ష్యంగా యాత్ర సాగుతోందని, ఈ క్రమంలో కాళ్లకు బొబ్బలు వచ్చినా ఆగేదిలేదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. మంగళవారం ఉదయం 7.15 గంటలప్పుడు కజాకూటమ్ సమీపంలోని కన్యాపురం నుంచి మూడవ రోజు యాత్ర ప్రారంభమైంది. 150 రోజుల్లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 3,570కిమీల పాదయాత్రను పూర్తి చేయాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. యాత్ర సాగుతున్న మార్గాల్లో రాహుల్‌కు తమ మద్దతు, సంఘీభావం తెలిపేందుకు అనేకమంది రోడ్డు ఇరు వైపులా నిలుచొని తమ ప్రోత్సాహాన్ని అందించారు. యాత్ర అట్టింగల్ వద్ద తొలుత ఆగింది. 'పాదయాత్ర అట్టింగల్ సమీపంలోని మామోమ్‌కు చేరుకుంది. ఇక్కడ వేర్వేరు సంఘాల వారితో మంతనాలు జరిపాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. సాయంత్రం 5 గంటలకు తిరిగి ప్రారంభమైన యాత్ర కల్లంభలం జంక్షన్ వరకు సాగింది. సోమవారం సాయంత్రానికి తమ యాత్ర 100 కిమీలను పూర్తి చేసుకున్న సందర్భంగా రాహుల్ మాటాడుతూ విద్వేషం, హింస, ఆగ్రహంతో ఎన్నికలు గెలవచ్చుగానీ సామాజిక-ఆర్థిక సమస్యలు పరిష్కరించలేరని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. భారత్ కలు చెదిరిపోయాయని, వాటిని మరలా చిగురింపజేసే దిశగా సమైక్య భారతావనికి యత్నిస్తున్నామన్నారు. '100కిమీల యాత్ర పూర్తి అయింది. ఇది ఆరంభం మాత్రమే' అని రాహుల్ అన్నారు. దేశంలో ప్రజల గొంతుక మూగబోయేలా చేస్తున్నారని, మీడియా వ్యవస్థలపై పాలకపక్షం ఒత్తిళ్లే ఇందుకు కారణమన్నారు. 'మేము వేసే ప్రతి అడుగుతో మా సంకల్పం మరింత బలపడుతోంద'ని జైరాం రమేశ్ అనంతరం ట్వీట్ చేశారు. ఈ యాత్ర బీజేపీ కలవరపెడుతోందన్నారు. సెప్టెంబరు 10న కేరళలో ప్రారంభమైన భారత్ జోడో యాత్ర 450కిమీలను పూర్తి చేసుకొని అక్టోబరు 1న కర్ణాటకలోకి ప్రవేశించనున్నది.

వారణాసి కోర్టు తీర్పు సరికాదు: ముఫ్తీ

జమ్మూ: జ్ఞాన్‌వాపి మసీదు కేసులో వారణాసి కోర్టు ఇచ్చిన తీర్పుపై పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ పెదవి విరిచారు. కోర్టు తీర్పు 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. బీజేపీ అజెండాకు అనుకూలమైన తీర్పుగా భావిస్తున్నట్టు చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించడంలో, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇప్పుడున్న పరిస్థితి ఇలాగే సాగితే దేశంలో మసీదులను కూలగొట్టడంలో విశ్వగురువు అవుతారంటూ ప్రధాని మోదీకి చురకలంటించారు.

బెయిల్ వచ్చినా...

జైలులోనే జర్నలిస్టు సిద్ధిఖి కప్పన్

లక్నో: సుప్రీం కోర్టు నుంచి ఇటీవల బెయిల్ పొందిన కేరళకు చెందిన జర్నలిస్టు సిద్ధిఖి కప్పన్ జైలులోనే ఉన్నారు. అతనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తున్న ఒక కేసు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున సిద్ధిఖి జైలులోనే ఉన్నట్లు జైలు విభాగం అధికారులు తెలిపారు. అత్యాచారానికి గురై దళిత మహిళ మరణించిన తర్వాత ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్ వెళుతుండగా అక్టోబర్ 2020న అరెస్టయిన తర్వాత జైలులో ఉన్న కప్పన్‌కు విడుదలకు సంబంధించి ఒక కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న కేసు పెండింగ్‌లో ఉన్నందున కప్పన్ జైలులో కొనసాగుతున్నాడు' అని జైళ్ల విభాగం డీజీ పీఆర్వో సంతోశ్ వర్మ తెలిపారు. అయితే అతని విడుదలకు ఆదేశాలు జారీ చేస్తూ, అదనపు సెషన్స్ జడ్జి (ఏఎస్‌జే) అనురోద్ మిశ్రా... కప్పన్‌కు రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు, అదే మొత్తానికి వ్యక్తిగత బాండ్‌ను అందించాలని ఆదేశించారు. సుప్రీం కోర్టు తనపై విధించిన షరతులను ఉల్లంఘించబోనని జర్నలిస్టును న్యాయమూర్తి హామీ కోరారు. కప్పన్‌తో పాటు మరో ముగ్గురు అతికుర్ రెహ్మాన్, ఆలం, మసూద్‌ను పోలీసులు మథురలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాతో సంబంధాలు కలిగి ఉన్నారని, హింసను ప్రేరేపించే కుట్రలో భాగమయ్యారని ఆరోపిస్తూ అరెస్టు చేశారు. అతనిపై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదయింది. శుక్రవారం సుప్రీం కోర్టు కప్పన్‌కు బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సమర్పణలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. బెయిల్ కోసం అనేక షరతులను విధించింది. జైలు నుంచి విడుదలయిన తర్వాత వచ్చే ఆరు వారాల పాటు అతను దిల్లీలోనే ఉండి ప్రతి సోమవారం నిజాముద్దీన్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. కప్పన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రతిపక్షాలు, జర్నలిస్టు సంఘాలు స్వాగతించాయి. కప్పన్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'సున్నిత లక్ష్యం'గా మార్చిందని, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అతనిపై దాఖలయిన మరొక కేసులో కూడా అతనికి బెయిల్ మంజూరవుతుందని వారు తెలిపారు. దళిత మహిళ 2020 సెప్టెంబర్ 14న సామూహిక అత్యాచారానికి గురై పక్షం రోజుల తర్వాత దిల్లీ ఆసుపత్రిలో మరణించింది. ఆమెను అర్ధరాత్రి తన గ్రామంలో దహనం చేశారు.

నిరంకుశం కన్నా రాచరికం మేలుగా!

రాహుల్ యాత్రపై సామ్నా ప్రశంస

ముంబై: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రపై శివసేన అధికార పత్రిక సామ్నా తన సంపాదకీయంలో ప్రశంసలు కురిపించింది. రాహుల్ గాంధీ ధరించిన బట్టలపై దుస్తులపై చర్చ చేయడం మానుకుని ఆయన సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలంటూ బీజేపీ నేతల వ్యవహార తీరుపై విమర్శలు గుప్పించింది. దేశంలో ప్రస్తుతం నిరంకుశ పాలన సాగుతోందని, దాని కన్నా వంశపారంపర్య రాజరిక పాలన ఉత్తమమని వ్యాఖ్యానించింది. యాత్రలో రాహుల్ గాంధీ సంధిస్తోన్న ప్రశ్నలు బీజేపీ నోరు మూయిస్తున్నాయని కొనియాడింది. దేశంలోని సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నిరుద్యోగం, రైతాంగం, కార్మికులు వ్యాపారవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాహుల్ ప్రశ్నలు లేవనెత్తడంపై హర్షం వ్యక్తం చేసింది. రాహుల్ యాత్రకు మంచి స్పందన లభిస్తోందని కితాబిచ్చింది. రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఆతను ఎటువంటి దుస్తులు ధరిస్తున్నాడు, ఏ ఆహారం తీసుకుంటున్నాడు తదితర అనుచిత ॥అంశాలను ముందుకు తెస్తూ దాడి చేస్తోందని బీజేపీ తీరును తీవ్రంగా ఎండగట్టింది. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర ప్రజల్లో ఆలోచనల్ని రేకెత్తిస్తోందనే కడపుమంట బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. రాహుల్ గాంధీ చేపట్టిన ఈ యాత్ర దేశంలో నెలకొన్న విద్వేష వాతావరణాన్ని రూపుమాపుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

రికార్డులు తిరగరాస్తున్న

బ్రహ్మాస్త్రం

హైదరాబాద్: భారీ అంచనాల మధ్య ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'బ్రహ్మాస్త్రం'...తొలుత ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకున్నప్పటికీ వారాంతంలో ఈ చిత్రం వసూళ్ల పరంగా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం 10 రికార్డులను దాటేసింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంటగా నటించిన ఈ చిత్రం... బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కెరీర్‌లోనే తొలి వారంలో అధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అన్ని భాషల్లో కలిపి ఈ చిత్రం రూ.36.50 కోట్లు వసూలు చేసింది. గతంలో వచ్చిన సంజూ రికార్డు(రూ.34.75కోట్లు)ను అధిగమించింది. 'బ్రహాస్త్రం' వీకెండ్ కలెక్షన్లు చూసుకుంటే రూ.125.50 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఇది అలియాభట్ నటించిన సినిమాల్లో అతిపెద్ద వీకెండ్ గ్రాసర్. గతంలో ఆమె నటించిన 'గంగూబాయి కాఠియావాడి', 'కళంక్' చిత్రాలను ఇది దాటేసింది. రణ్‌బీర్‌కు మాత్రమే కాదు, అలియా భట్‌కు కూడా ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్ మూవీగా చెబుతున్నారు. కళంక్ రూ.21.60కోట్లు రాబట్టగా, 'బ్రహాస్త్రం' రూ.36.50కోట్లు వసూలు చేసింది.

2022లో బాలీవుడ్‌లో విడుదలైన అత్యధిక చిత్రాలు మెప్పించలేకపోయాయి. కానీ, 'బ్రహాస్త్రం' ప్రారంభ వసూళ్లు బాగా వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ కార్తిక్ ఆర్యన్ 'భూల్ భూలయ్య2' అత్యధికంగా రూ.14.11కోట్లు వసూలు చేయగా, ఆ రికార్డును తిరగ రాస్తూ ఈ చిత్రం రూ.36.50కోట్లు వసూలు చేసింది. ఇక ప్రపంచవ్యాప్తంగా 'బ్రహాస్త్రం' వీకెండ్ (సెప్టెంబరు 9-11) కలెక్షన్స్ జాబితా చూసుకుంటే రూ.225కోట్లతో చాలా హాలీవుడ్ చిత్రాలను దాటేసింది. కరోనా తర్వాత అత్యధిక ఓపెనింగ్ వసూళ్లు సాధించిన చిత్రంగానూ 'బ్రహ్మాస్త్రం' నిలిచింది. గతంలో అక్షయ్, కత్రీనా జంటగా నటించిన సూర్యవంశి తొలిరోజు వసూళ్లు రూ.26.29 కోట్లు కాగా, బ్రహ్మాస్త్రం రూ.36.50 కోట్లు వసూలు చేసింది. ఆస్ట్రేలియాలోనూ 'బ్రహాస్త్రం' అదరగొట్టింది. మిలియన్ డాలర్లకు చేరువగా వసూళ్లు రాబట్టిన బాలీవుడ్ చిత్రంగా రికార్డు నెలకొల్పింది. వీకెండ్ ఓపెనింగ్‌లో రూ.100కోట్లు వసూలు చేసిన బాలీవుడ్ చిత్రంగా 'బ్రహ్మాస్త్రం' నిలిచింది. హిందీలోనే కాదు, ఇతర భాషల్లోనూ మంచి వసూళ్లు రాబడుతున్న చిత్రంగా 'బ్రహాస్త్రం' రికార్డులు సృష్టిస్తోంది.

చివరి చూపునకూ నోచుకోలేకపోయా...

హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు రెబల్ స్టార్ కృష్ణంరాజు అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. సోమవారం సినీ, రాజకీల ప్రముఖుల సమక్షంలో ఆయనకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఇదిలా ఉంటే కృష్ణంరాజు మరణవార్తను టాలీవుడ్ ఇంకా జీర్ణించుకోలేకపోతోంది. ఆయనతో కలిసి పనిచేసిన నటీనటులు, సాంతిక నిపు ణులు తమ అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. తాజాగా కృష్ణం రాజు, ప్రభాస్‌తో కలిసి రెబల్ సినిమాను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు, నటుడు రాఘవా లారెన్స్ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రెబల్ సినిమా షూటింగ్ సమయంలో కృష్ణంరాజు ఇచ్చిన ఆతిథ్యాన్ని గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యాడు లారెన్స్. కృష్ణంరాజు, ప్రభాస్‌తో కలిసున్న ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేసిన ఆయన.. 'రెబల్ స్టార్ కృష్ణంరాజు గారిని మిస్ అవుతున్నాను. ఆయన ప్రతి ఒక్కరినీ సొంత బిడ్డలా చూసుకుంటారు.. అందరికీ ఆయన ఓ అమ్మలా ఆహారం వడ్డిస్తుంటారు. కృష్ణంరాజు ప్రేమ, కేరింగ్‌ను బాగా మిస్ అవుతున్నా. నేను టౌన్‌లో లేకపోవడం వల్ల ఆయనకు వీడ్కోలు పలకలేకపోయాను. అది నా దురదృష్టం. ఆయన వారసత్వం ప్రభాస్ ద్వారా ఎల్లప్పుడూ కొనసాగుతుంది' అని తన ఆవేదనకు అక్షర రూపమిచ్చాడు రాఘవ.కాగా వీరి కాంబినేషన్‌లో వచ్చిన రెబల్ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. అయితే ఇందులోని యాక్షన్ సీక్వెన్స్‌కు మంచి పేరొచ్చింది.

రామ్ ఆశలన్నీ బోయపాటిపైనే...

హైదరాబాద్: ఇస్మార్ట్ శంకర్ సినిమా ఇచ్చిన హిట్ తప్పా ఇప్పటి వరకు మరో హిట్ రుచి చూడాలకపోయాడు యంగ్ హీరో రామ్ పోతినేని పూరిజగన్నాథ్ తెరకెక్కించిన ఆ సినిమాలో రామ్ మాస్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నాడు. తెలంగాణ యాసలో ఇరగదీశాడు రామ్. ఈ సినిమా సూపర్ హిట్ అయిన తర్వాత రామ్ మార్కెట్ మారిపోయింది. అయితే ఆ సినిమా తర్వాత చేసిన సినిమాలన్నీ మళ్లీ యథావిధిగా నిరాశపరచడం మొదలుపెట్టాయి. తిరుమల కిషోర్ తెరకెక్కించిన రెడ్, రీసెంట్ గా వచ్చిన వారియర్ సినిమాలు దారుణంగా నిరాశ పరిచాయి. దాంతో ఇప్పుడు ఈ యంగ్ హీరో ఆశలన్నీ బోయపాటి పైనే పెట్టుకున్నాడు. రామ్ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే అఖండ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్నారు బోయపాటి. మాస్ సినిమాలకు పెట్టింది పేరుగా మారిన బోయపాటి.. ఇప్పుడు రామ్ కోసం అదే తరహా కథను రెడీ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది. ఈ కాంబినేషన్ అనౌన్స్ చేసిన దగ్గర నుంచి ఈ సినిమా పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఈ సినిమా గురించి ఇప్పుడు ఒక వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో రామ్ చాలా డిఫరెంట్‌గా కనిపించ న్నాడట. బోయపాటి ఈ సినిమాను పొలిటికల్ అండ్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తు న్నారట. ఈ మూవీలో రామ్ రామ్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నాడట. సినిమా చాలా వరకు కేరళ నేపథ్యంలో సాగుతుందని.. రామ్ ఒక అయ్యప్ప భక్తుడిగా నటిస్తారని టాక్. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు.

పంత్ ఐదో స్థానం, పాండ్యా ఆరోస్థానంలో బ్యాటింగ్ చేయాలి: సన్నీ

ముంబై: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టులోకి ఇటీవల అంతగా రాణించని రిషభ్ పంత్, దీపక్ హుడాలకు స్థానం కల్పించడం సరికాదన్న విమర్శలొస్తున్నాయి. అదే సమయంలో అయితే ఐపీ ఎల్ గత సీజన్‌లో రాణించిన సీనియర్ ఆటగాడు దినేశ్ కార్తిక్‌ను ఎంపిక చేయడంపై ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో తుది జట్టు ఎంపికపై సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ... మెగా టోర్నీలో విజయం సాధించాలంటే కొన్ని రిస్క్‌లు చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తాను సారథి అయితే వచ్చే ప్రపంచకప్‌లో రిషభ్ పంత్‌తోపాటు దినేశ్ కార్తిక్‌కు తుది జట్టులో స్థానం కల్పిస్తానని తెలిపాడు. "నేను రిషభ్ పంత్, దినేశ్ కార్తిక్‌లను తుది జట్టులో ఆడిస్తా. పంత్ ఐదో స్థానంలో హార్దిక్ పాండ్య ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు పంపిస్తా. అవ సరమైతే వీరిద్దరి స్థానాలను అటుఇటు మారుస్తా. ఇక దినేశ్ కార్తిక్‌ను లోయర్ ఆర్డర్‌లో ఏడో స్థానంలో ఆడిస్తా. హార్దిక్ కాకుండా మరో నలుగురు కీలక బౌలర్లను తీసుకుంటా. మెగా ఈవెంట్‌లో రిస్క్ తీసుకోకపోతే విజయాలను సాధించడం కష్టం. అన్ని విభాగాల్లోనూ దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటేనే ఫలితం అనుకూలంగా వస్తుంది" అని గావస్కర్ వివరించాడు. బౌలింగ్ గురించి మాట్లాడుతూ... జస్ప్రీత్ బుమ్రా, హర్షల్ పటేల్ జట్టులోకి తిరిగి రావడం శుభపరిణామమని తెలిపాడు. 'ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన జట్టు బాగుంది. సమతూకంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అందుకే ఈసారి టీమిండియా ప్రపంచకప్‌ను గెలిచే అవకాశం ఉందని భావిస్తున్నా. ఆసియా కప్‌లో జరిగిందంతా భారత్‌కు ఓ హెచ్చరిక. అయితే, వరల్డ్ కప్‌తో టీమ్‌ఇండియా తిరిగి వస్తుందని బలంగా నమ్ముతున్నా. బీసీసీఐ ఎంపిక చేసిన జట్టుకు మనమంతా మద్దతుగా నిలవాలి. ఆసియా కప్‌లో సరైన బౌలింగ్ దళంతో బరిలోకి దిగలేకపోయాం. బుమ్రా, హర్షల్ పటేల్ లేని లోటు స్పష్టం కనిపించింది. అయితే, ప్రపంచకప్ జట్టులోకి రావడం శుభపరిణామం. లక్ష్యాలను కాపాడుకోవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషిస్తారు" అని గవాస్కర్ ఆశాభావం వెలిబుచ్చాడు.

బిగ్‌బాష్ లీగ్‌కు స్మృతి దూరం?

న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన...ఆస్ట్రేలియాలో జరిగే టీ20 టోర్నమెంట్ బిగ్‌బాష్ లీగ్ నుంచి ఆమె తప్పుకునే అవకాశం ఉంది. మంధాన 2022 ఫిబ్రవరి నుంచి విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడుతోంది. ఫిబ్రవరిలో ఇండియా-న్యూజిలాండ్ ద్వైపాక్షిక టోర్న మెంట్‌లో, ఆ తర్వాత వన్డే వరల్డ్ కప్‌లో ఆడింది. అనంతరం కామన్వెల్త్ క్రీడల్లోనూ పాల్గొంది. మళ్లీ ఇప్పుడు ఇంగ్లాండ్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడుతోంది. అయితే... ఆస్ట్రేలియాలో జరిగే టీ20 టోర్నమెంట్ బిగ్‌బాష్ లీగ్ లో పాల్గొనకపోవచ్చని స్వయంగా స్మృతి మంధాన వెల్లడించింది. 'మానసికంగా కాకున్నా.. ఫిజికల్‌గా ఒత్తిడి లేకుండా మేనేజ్ చేసుకోవడం కూడా ముఖ్యమే. బిగ్‌బాష్ లీగ్ నుంచి బయటకు రావాలనుకుంటున్నాను. ఎందుకంటే నేను భారత జట్టు ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లు మిస్ కాదలచుకోలేదు. నేను భారత జట్టు తరఫున ఆడినప్పుడు.. నా నుంచి 100 శాతం ప్రదర్శన ఇవ్వాలనుకుంటాను' అని చెప్పుకొచ్చింది. అయితే బిగ్‌బాష్ లీగ్ అక్టోబర్ 13న ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ నవంబర్ చివరి వరకు సాగుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఇంగ్లాడ్ సిరీస్ ఈ నెల 24న ముగియనుంది. దాని తర్వాత అక్టోబర్ 1 నుంచి 16 వరకు జరగనున్న ఆసియా కప్ కోసం బంగ్లాదేశ్‌కు వెళ్లనుంది. ఆ తర్వాత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి దాకా భారత్‌కు వివిధ టోర్నమెంట్‌లు ఉన్నాయి. అయితే ఈ బిగ్‌బాష్ డొమెస్టిక్ టోర్నమెంట్ ఆడితే తనపై మరింత ఒత్తిడి పెరుగుతుందని చెబుతోంది స్మృతి. దానికోసం బిగ్‌బాష్ లీగ్ నుంచి విశ్రాంతి తీసుకోవాలని స్మృతి మంధాన భావిస్తోంది. అలా అయితే.. తర్వాత జరగనున్న వరుస మ్యాచ్‌ల్లో తనపై భారం తగ్గుతుందని ఆమె అనుకుంటోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.